త్రుటిలో చేజారె

- యువ షూటర్ మను భాకర్‌కు తీవ్ర నిరాశ
- 25మీటర్ల పిస్టల్ పోరులో నాలుగో స్థానం
- ఆర్చరీలో ముగిసిన భారత పోరు

ప్రతిష్ఠాత్మక పారిస్ ఒలింపిక్స్‌లో భారత్‌కు త్రుటిలో పతకం చేజారింది. ఇప్పటికే రెండు కాంస్య పతకాలతో కొత్త చరిత్ర లిఖించిన యువ షూటర్ మను భాకర్‌కు మూడో పతకం ముచ్చటగానే మిగిలింది. మహిళల 25మీటర్ల పిస్టల్ ఫైనల్ ఈవెంట్‌లో బరిలోకి దిగిన భాకర్ తృటిలో పతక అవకాశాన్ని చేజార్చుకుంది. పాయింట్ల తేడాతో హంగరీ షూటర్‌కు కాంస్య పతకాన్ని వదులుకుంది. విశ్వక్రీడల్లో తన అద్భుత ప్రదర్శనతో దేశ కీర్తి, ప్రతిష్ఠలను ఇనుమడింపచేసిన మను పిస్టల్ పోరులో తుదికంటా పోరాడింది. పతక వేటలో రెండు షాట్ల వైఫల్యంతో మూడో మెడల్ ఖాతాలో వేసుకోలేక నాలుగో స్థానంతో నిరాశపరిచింది. మొత్తంగా టోక్యో ఒలింపిక్స్ పేలవ ప్రదర్శనను మదిలో నుంచి చెరిపేస్తూ భారత షూటింగ్‌లో మను కొత్త చరిత్రకు నాంది పలికింది.

పతక ఆశల మధ్య బరిలోకి దిగిన భారత ఆర్చర్లు భజన్‌కౌర్, దీపికా కుమారి ఘోరంగా నిరాశపరిచారు. వ్యక్తిగత విభాగంలో ఈ ఇద్దరు స్థాయికి తగ్గ ప్రదర్శన కనబర్చడంలో విఫలమై పారిస్ నుంచి భారంగా నిష్క్రమించారు. పురుషుల, మహిళల షూటింగ్ స్కీట్ ఈవెంట్‌లో భారత్‌కు ఆశించిన ఫలితాలు దక్కలేదు. సెయిలింగ్‌లో నేత్రా కుమనన్, విష్ణు శరవణన్ తదుపరి రౌండ్‌కు అర్హత సాధించలేకపోయారు. గోల్ఫ్‌లో శుభాంకర్, గగన్‌జీత్ ఆకట్టుకోలేకపోయారు.

పారిస్: పారిస్ విశ్వక్రీడల్లో భారత్‌కు త్రుటిలో పతకం చేజారింది. యువ షూటర్ మను భాకర్‌కు చిక్కినట్లు చిక్కిన పతకం పాయింట్ల తేడాతో మరొకరి వశం అయ్యింది. శనివారం ఆఖరి వరకు ఆసక్తికరంగా సాగిన మహిళల 25మీటర్ల వ్యక్తిగత పిస్టల్ ఈవెంట్ ఫైనల్లో మను భాకర్ వెంట్రుకవాసిలో మూడో పతకాన్ని దక్కించుకునే అవకాశాన్ని కోల్పోయింది. ఆఖరి షాట్ వరకు నువ్వానేనా అన్నట్లు సాగిన పోరులో జేవ యంగ్(కొరియా)-37, జెడ్రెవ్‌స్కీ(ఫ్రాన్స్)-37, వెరొనికా మేజర్(హంగరీ)-31 వరుసగా స్వర్ణ, రజత, కాంస్య పతకాలు గెలుచుకోగా, మను భాకర్ 28 పాయింట్లతో నాలుగో స్థానంలో నిలిచింది. ఇప్పటికే 10మీటర్ల పిస్టల్ వ్యక్తిగత విభాగంతో పాటు సరబ్‌జ్యోత్‌సింగ్‌తో కలిసి మిక్స్‌డ్‌టీమ్ ఈవెంట్‌లో కాంస్యాలు సాధించిన మను..మూడో పతకంపై పెట్టిన గురి దురదృష్టం కొద్ది తప్పింది.

'పోటీల్లో ఒకింత ఒత్తిడికి గురయ్యాను. కానీ అత్యుత్తమ ప్రదర్శన కనబరిచేందుకు చాలా వరకు ప్రయత్నించాను. కానీ అది సరిపోలేదు. నా వరకైతే ఈ ఒలింపిక్స్ అద్భుతంగా ముగిసింది. వచ్చే ఒలింపిక్స్(లాస్ ఎంజిల్స్)లో రాణించేందుకు సిద్ధంగా ఉన్నాను. రెండు పతకాలతో ప్రస్తుతం సంతోషంగా ఉన్నా..నాలుగో స్థానంతో ముగించడం నిరాశగా ఉంది' - మను భాకర్

స్కీట్‌లో నిరాశ:

స్కీట్ షూటింగ్‌లో భారత షూటర్లు తీవ్రంగా నిరాశపరిచారు. మొత్తం 30 మంది పురుషుల స్కీట్ ఈవెంట్‌లో అనంత్‌జీత్‌సింగ్ నరుక 24వ స్థానంతో ముగించాడు. మహిళల ఈవెంట్‌లో మహేశ్వరి చౌహాన్ 71 పాయింట్లతో ఎనిమిదో స్థానంలో కొనసాగుతుండగా, రైజా ధిల్లాన్ 25వ స్థానంలో ఉంది. ఆదివారం క్వాలిఫికేషన్ రౌండ్లు జరుగుతాయి.

పోటీ సాగిందిలా: మొత్తం ఎనిమిది షూటర్లతో 25 మీటర్ల పిస్టల్ ఫైనల్ పోరు ఆసక్తికరంగా సాగింది. తొలుత అందరికీ సమాన షాట్లు కేటాయించగా, అందులో వచ్చిన పాయింట్ల ఆధారంగా తర్వాత ఎలిమినేషన్ మొదలుపెట్టారు. తొలుత అబ్లైన్(అమెరికా) 5 పాయింట్లతో ఎనిమిదో స్థానంతో పోటీ నుంచి నిష్క్రమించగా, ఆ తర్వాత త్రిస్ట్(వియత్నాం, 16), రోస్టెమియాన్(ఇరాన్, 19), జావో(చైనా, 23) అనుసరించారు. అయితే మూడో స్థానం కోసం మను భాకర్, హంగరీ షూటర్ వెరోనిక మధ్య పోరు జరిగింది. అప్పటికే 28 పాయింట్లతో సమంగా ఉన్న ఈ ఇద్దరు పోటీని ప్రారంభించారు. ఐదేసి షాట్లతో ఎనిమిది సిరీస్‌లు ముగిసే వరకు చెక్కుచెదరని గురితో ఆకట్టుకున్న భాకర్ ఒకింత తడబాటుకు గురై రెండు సార్లు సరైన షాట్లు సంధించలేకపోయింది. మరోవైపు ఏ మాత్రం ఒత్తిడికి గురికాని వెరోనిక కచ్చితమైన షాట్లతో గురిచూసి కొట్టి కాంస్య పతకాన్ని ఖాయం చేసుకోగా, భాకర్ ఒకింత భారంగా నిష్క్రమించింది. ఒక దశలో ఆరో స్థానానికి పడిపోయిన మను..అద్భుతంగా పుంజుకుని పోటీలోకి వచ్చింది. పోటీల మొదట్లో గురి పెట్టడంలో కీలక పాయింట్లు చేజార్చుకున్న భాకర్..రౌండ్ రౌండ్‌కు తన ప్రదర్శనను మెరుగుపర్చుకుంది. ఈ క్రమంలో గత ఒలింపిక్స్‌లో నాలుగో స్థానంతో పతకాలు చేజార్చుకున్న జాయ్‌దీప్ కర్మాకర్(2012), అభినవ్‌బింద్రా(2016), అర్జున్ బబుతా(2024) సరసన మను భాకర్ నిలిచింది.

నిషాంత్ నిష్క్రమణ

పోరాడి ఓడిన యువ బాక్సర్

భారత యువ బాక్సర్ నిషాంత్ దేవ్ పోరాటం ముగిసింది. కచ్చితంగా పతకం సాధిస్తాడన్న అంచనాల మధ్య బరిలోకి దిగిన నిషాంత్..శనివారం జరిగిన పురుషుల 71కిలోల క్వార్టర్ ఫైనల్ బౌట్‌లో 1-4 తేడాతో మార్కో వెర్డె (మొరాకో) చేతిలో పోరాడి ఓడాడు. బౌట్ మొదలైనప్పటి నుంచి ముగిసే వరకు ప్రత్యర్థి బాక్సర్‌పై పంచ్‌ల వర్షం కురిపించిన నిషాంత్..ఓటమి వైపు నిలువడం అందరినీ ఆశ్చర్యపరిచింది. బౌట్‌లో చురుకుగా కదులుతూ కనిపించిన ఈ హర్యానా యువ బాక్సర్ విసిరిన పంచ్‌లకు మొరాకో బాక్సర్ సాగిలపడిపోయాడు. అయినా రిఫరీలు నిషాంత్ వైపు కాకుండా మార్కో వైపే మొగ్గు చూపారు. దీంతో పురుషుల బాక్సింగ్‌లో భారత ప్రస్థానం ముగిసింది.

బైల్స్ పసిడి జోరు

పారిస్: అమెరికా స్టార్ జిమ్నాస్ట్ సిమోన్ బైల్స్..పారిస్ ఒలింపిక్స్‌లో పసిడి పతకాల పంట పండిస్తున్నది. తాను అడుగుపెట్టనంత వరకే ఒక్కసారి పోటీకి దిగితే పసిడి పక్కా అన్న రీతిలో దూసుకెళుతున్నది. ఇప్పటికే వేర్వేరు విభాగాల్లో రెండు స్వర్ణాలు సొంతం చేసుకున్న బైల్స్..శనివారం జరిగిన మహిళల వాల్ట్ కేటగిరీలో మరో గోల్డ్ ఖాతాలో వేసుకుంది. దీంతో పారిస్‌లో బైల్స్ స్వర్ణాల సంఖ్య మూడుకు చేరుకుంది. ఆద్యంతం ఆసక్తికరంగా సాగిన వాల్ట్ పోటీలో బైల్స్ 15.300 స్కోరుతో ఈ అమెరికా సంచలనం టాప్‌లో నిలువగా, అండ్రెడ్ (14.966, బ్రెజిల్), క్యారె (14.466) వరుసగా రజత, కాం స్య పతకాలు సొంతం చేసుకున్నారు. ఇప్పటి వరకు మూడు ఒలింపిక్స్‌లో ఏడు స్వర్ణాలు సాధించిన తొలి జిమ్నాస్ట్‌గా బైల్స్ అరుదైన రికార్డును సొంతం చేసుకుంది.

ఒలింపిక్స్‌లో మూడో డోపింగ్ కేసు

పారిస్ ఒలింపిక్స్‌లో మూడో డోపింగ్ కేసు నమోదైంది. అఫ్ఘానిస్థాన్‌కు చెందిన జూడో ప్లేయర్ మహమ్మద్ సమీమ్ ఫైజద్ డోపింగ్ పరీక్షలో పాజిటివ్‌గా తేలడాడు. తన తొలి బౌట్ సందర్భంగా ఫైజద్ నుంచి సేకరించిన నమూనాల్లో నిషేధిత ఉత్ప్రేరకాలు ఉన్నట్లు అంతర్జాతీయ టెస్టింగ్ ఏజెన్సీ శనివారం ఒక ప్రకటనలో పేర్కొంది. 1988 సియోల్ ఒలింపిక్స్ సందర్భంగా స్ప్రింటర్ బెన్ జాన్సన్ వినియోగించిన నిషేధిత అనబాలిక్ స్టెరాయిడ్ ఉత్ప్రేరకం ఫైజద్ నమూనాల్లో దొరికాయి. 22 ఏండ్ల ఫైజద్ 81కిలోల తొలి బౌట్‌లో చేతిలో ఓడి ఒలింపిక్స్ నుంచి నిష్క్రమించాడు.

మథియస్ బో గుడ్‌బై

భారత బ్యాడ్మింటన్ ద్వయం సాత్విక్‌సాయిరాజ్, చిరాగ్‌శెట్టికి ఇన్ని రోజులు కోచ్‌గా వ్యవహరించిన మతియస్ బో తన బాధ్యతల నుంచి తప్పుకున్నాడు. పారిస్ ఒలింపిక్స్‌లో సాత్విక్, చిరాగ్ పోరు అర్ధాంతరంగా ముగియడంతో ఈ నిర్ణయానికి వచ్చినట్లు బో శనివారం తన ఇన్‌స్టాగ్రామ్‌లో రాసుకొచ్చాడు. లండన్(2012) ఒలింపిక్స్ రజత పతక విజేత అయిన ఈ 44 ఏండ్ల డెన్మార్క్ మాజీ ప్లేయర్ గత కొన్నేండ్లుగా భారత బ్యాడ్మింటన్ ప్లేయర్లకు కోచ్‌గా ఉన్నాడు. 'నా వరకు కోచింగ్ రోజులు ఇక్కడితో ముగిశాయి. భారత్‌లోనే కాదు ఎక్కడా కూడా నేను కోచ్‌గా కొనసాగడం లేదు. బ్యాడ్మింటన్ హాల్‌లో చాలా సుదీర్ఘ సమయం గడిపి అలసిపోయాను' అని ఇన్‌స్టాగ్రామ్‌లో రాసుకొచ్చాడు.

ఇమానె ఖెలిఫ్‌కు పతకం

అల్జీరియా యువ బాక్సర్ ఇమానె ఖెలిఫ్ పారిస్ ఒలింపిక్స్‌లో పతకం పక్కా చేసుకుంది. గత కొన్ని రోజులుగా తన లింగనిర్ధారణపై ప్రపంచవ్యాప్తంగా వస్తున్న విమర్శలకు పంచ్‌పవర్‌తో దీటైన సమాధానం చెప్పింది. అసలు నువ్వు మహిళనే కాదంటూ సోషల్‌మీడియాలో వెల్లువెత్తిన ఎత్తిపొడుపు మాటలకు ఖెలిఫ్ ఫుల్‌స్టాప్ పెట్టింది. శనివారం జరిగిన మహిళల 66కిలోల క్వార్టర్స్ బౌట్‌లో ఖెలిఫ్ 5-0 తేడాతో

హంగరీ బాక్సర్ అన్నా లుకా హమోరీపై అద్భుత విజయం సాధించింది. తద్వారా సెమీఫైనల్ బెర్తుతో ఒలింపిక్స్‌లో కనీసం కాంస్య పతకాన్ని ఖాయం చేసుకుంది. తన కెరీర్‌లో రెండో ఒలింపిక్స్ ఆడుతున్న ఇమానె ఖెలిఫ్‌కు ఇది తొలి పతకం కావడం విశేషం. తన తొలి పోరులో ఇటలీ బాక్సర్ ఎంజెలా కెరినీ మధ్యలో వైదొలుగడంతో ఖెలిఫ్‌పై విమర్శల పర్వం మొదలైన సంగతి తెలిసిందే.

వాహ్ తాజ్!

భారత ప్లేయర్లకు నోరూరించే రుచులు రెడీ

పారిస్ ఒలింపిక్స్‌లో భారత ప్లేయర్లకు నోరూ ఊరించే రుచులు సిద్ధమయ్యాయి. గేమ్స్ విలేజ్‌లో సరైన ఆహారం లేక సతమతమవుతున్న మనోళ్లకు తాజ్‌మహల్, బాంబే రెస్టారెంట్లు అదిరిపోయే రీతిలో ఆహార పదార్థాలను అందిస్తున్నాయి. విశ్వక్రీడల్లో పోటీపడుతున్న ప్లేయర్లకు తోడు చూడటానికి విచ్చేసిన ప్రేక్షకుల కోసం రెస్టారెంట్ల నిర్వాహకులు ప్రత్యేక మెనూతో ఆకట్టుకుంటున్నారు. పోటీల ప్రారంభానికి ముందు స్టార్ షూటర్ మను భాకర్ తమ దగ్గరే రుచి చూసిందంటూ తాజ్‌మహల్ సహ యజమాని అతిఫ్ నోమన్ చెప్పుకొచ్చాడు. పతకాలు గెలిచిన తర్వాత వస్తే..ఆమె అడిగిన డిషెస్‌ను వడ్డించేందుకు సిద్ధంగా ఉన్నామని ఆయన తెలిపాడు.

ఆర్చరీలో ఖేల్ ఖతం

ఒలింపిక్స్ ఆర్చరీలో భారత్ పోరాటం ముగిసింది. పతకాలు గెలుస్తారన్న అంచనాల మధ్య పోటీకి దిగిన వెటరన్ ఆర్చర్ దీపికా కుమారితో పాటు యువ ఆర్చర్ భజన్ కౌర్ విఫలమయ్యారు. శనివారం తొలుత జరిగిన మహిళల వ్యక్తిగత ప్రిక్వార్టర్స్‌లో దీపిక 6-4తో జర్మనీకి చెందిన క్రాపెన్‌పై అద్భుత విజయం సాధించింది. తొలి సెట్ నుంచే అద్భుత ప్రదర్శన కనబరుస్తూ పాయింట్లు ఖాతాలో వేసుకుంది. జర్మనీ ఆర్చర్‌కు ఎక్కడా అవకాశమివ్వకుండా కచ్చితమైన గురితో ఆకట్టుకుంది. అయితే క్వార్టర్స్‌లో మాత్రం ఫలితం రివర్స్ అయ్యింది. కొరియా ఆర్చర్ సుహ్యాన్ నామ్ చేతిలో 6-4తో దీపిక ఓటమిపాలైంది. తొలి సెట్(28)తో పాటు మూడో సెట్(29)ను దక్కించుకున్న దీపికాకు వరుసగా నాలుగు, ఐదు సెట్లలో నామ్ నుంచి తీవ్ర పోటీ ఎదురైంది. ఒక దశలో 4-2 ఆధిక్యం కనబరిచిన దీపిక..షాట్లలో తడబాటుతో మూల్యం చెల్లించుకుంది. దీంతో మరోమారు ఒలింపిక్స్ నుంచి ఉత్త చేతులతో దీపిక ప్రస్థానం ముగిసింది. మరోవైపు యువ ఆర్చర్ భజన్‌కౌర్ ప్రిక్వార్టర్స్‌లో5-6తో దియా నంద చొరోనిసియా(ఇండోనేషియా) చేతిలో పోరాడి ఓడింది. ఐదు సెట్ల పోరు సమం కావడంతో విజేతను నిర్ణయించేందుకు నిర్వహించిన షూటాఫ్‌లో భజన్‌కు ఐదు పాయింట్లు రాగా, దియానంద ఆరు పాయింట్లతో విజయం సాధించింది. మొత్తంగా పారిస్ ఒలింపిక్స్‌లో మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో బొమ్మదేవర ధీరజ్, అంకితా భకత్ కాంస్య పతక పోరు మెరుగైన ప్రదర్శనగా నమోదైంది.

భారత్ శ్రీలంక రెండో వన్డే నేడు
మ:2:30నుంచి సోనీ స్పోర్ట్స్‌లో

పతకాల పట్టిక

	దే	స్వ	ర	కా	మొ
1	చైనా	16	11	9	36
2	యూఎస్ఏ	12	23	20	55
3	ఫ్రాన్స్	12	14	15	41
4	ఆస్ట్రేలియా	12	7	6	25
5	బ్రిటన్	10	10	13	33
6	కొరియా	9	7	5	21
49	భారత్	0	0	3	3

దే: దేశం, స్వ: స్వర్ణం, ర: రజతం, కా: కాంస్యం మొ: మొత్తం

సత్తాచాటిన ప్రతిభ

చెస్ బాక్సింగ్ టోర్నీలో ఐదు స్వర్ణాలు

హైదరాబాద్, ఆట ప్రతినిధి: కోల్‌కతా వేదికగా జరిగిన రెండవ ఆసియా చెస్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌తో పాటు 3వ ఇండియన్ ఓపెన్ ఇంటర్నేషనల్ టోర్నీలో తెలంగాణ ప్లేయర్ తక్కడపల్లి ప్రతిభ సత్తాచాటింది. కామారెడ్డి జిల్లా పిట్లంకు చెందిన ప్రతిభ ఐదు స్వర్ణాలు సహా ఒక రజత పతకంతో మెరిసింది. మరోవైపు సబ్‌జూనియర్ విభాగంలో బాన్సువాడకు చెందిన రుషాంక్‌రెడ్డి రెండు స్వర్ణాలు, విజయ్ రాఘవేంద్రరావు రెండు రజత పతకాలు సాధించారు.

ఢిల్లీలో అవార్డు అందుకుంటున్న జీవన్‌దాన్ నిర్వాహకురాలు డాక్టర్ స్వర్ణలత

'జీవన్‌దాన్'కు రెండు జాతీయ అవార్డులు

- అవయవదానంలో ఉత్తమ రాష్ట్రంగా తెలంగాణ
- ఉత్తమ ప్రోగ్రాం అధికారిగా స్వర్ణలత

హైదరాబాద్, ఆగస్టు 3 (నమస్తే తెలంగాణ): అవయవదానంలో రాష్ట్రం మరోసారి ఆదర్శంగా నిలిచింది. జీవన్ దాన్ కార్యక్రమానికి రెండు జాతీయ అవార్డులు లభించాయి. కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖకు చెందిన 'నేషనల్ ఆర్గాన్ అండ్ టిష్యూ ట్రాన్స్‌ప్లాంట్ ఆర్గనైజేషన్' శనివారం ఢిల్లీలో నిర్వహించిన కార్యక్రమంలో ఈ అవార్డులను ప్రదానం చేసింది. గత ఏడాది కాలంలో అత్యధికంగా అవయవ దానం, అవయవ మార్పిడి శస్త్రచికిత్సలు నిర్వహించిన రాష్ట్రంగా తెలంగాణ నిలిచింది. ఈ నేపథ్యంలో కేంద్రం ఉత్తమ రాష్ట్ర అవార్డును ప్రకటించింది. దీంతోపాటు అవయవదాన రంగంలో ఉత్తమ సేవలు అందిస్తున్నందుకుగానూ జీవన్‌దాన్ కార్యక్రమ నిర్వాహకురాలు డాక్టర్ స్వర్ణలతను 'ఉమెన్ పయనీర్ ఇన్ ద ఫీల్డ్ ఆఫ్ ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంట్' అవార్డు వరించింది. ఢిల్లీలో కేంద్ర ఆరోగ్య శాఖ సహాయ మంత్రి అనుప్రియా పాటిల్, నీతిఆయోగ్ సభ్యులు డాక్టర్ వినోద్ కే పాల్ చేతుల మీదుగా జీవన్‌దాన్ కార్యక్రమ నిర్వాహకురాలు డాక్టర్ స్వర్ణలత అవార్డును స్వీకరించారు.

1150 మందికి సర్జరీలు

జీవన్ దాన్ కార్యక్రమం కింద 2023 మార్చి నుంచి ఈ ఏడాది జూలై వరకు 303 మంది నుంచి అవయవాలను సేకరించినట్టు వైద్యశాఖ తెలిపింది. వాటిని మొత్తం 1150 మందికి అవయవమార్పిడి చేసినట్టు వెల్లడించింది. ఇందులో కిడ్నీ 457, కాలేయం 273, గుండె 30, ఊపిరితిత్తులు 118, పిత్తాశయం 2, కార్నియా 270 సర్జరీలు ఉన్నట్టు పేర్కొంది.

పహాణీ జారీకి 10 వేల లంచం

- **ఏసీబీకి చిక్కిన తహసీల్దార్, డ్రైవర్**

కాల్వశ్రీరాంపూర్, ఆగస్టు 3: పహాణీ నకల్ కోసం రైతు నుంచి రూ.10 వేలు లంచం తీసుకుంటుండగా తహసీల్దార్‌తోపాటు ఆయన డ్రైవర్, ప్రైవేటు వ్యక్తిని ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. ఈ మేరకు శనివారం కరీంనగర్ ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి వివరాలు వెల్లడించారు. ఓదెల మండలం కొమిరె గ్రామానికి చెందిన కాడం తిరుపతి, ఆయన తండ్రి మల్లయ్యకు కాల్వశ్రీరాంపూర్ మండలం పందిల్ల గ్రామ శివారులోని సర్వేనెంబర్ 645లో 28 గుంటల భూమి ఉంది. ఈ భూమి మీద బ్యాంక్ లోన్ తీసుకోవడం కోసం లింక్ డాక్యుమెంట్(పహాణీ నకల్) అవసరం కావడంతో తహసీల్దార్ జాహెద్‌పాషాను సంప్రదించాడు. పహాణీ నకల్ కావాలంటే రూ.10 వేలు లంచం ఇస్తేనే ఇస్తానని తహసీల్దార్ చెప్పడంతో తిరుపతి ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. ప్లాన్ ప్రకారం.. తహసీల్దార్ కార్యాలయంలోనే తహసీల్దార్ జాహెద్‌పాషా, చిన్నరాతపల్లి వీఆర్ఏ దాసరి మల్లేశం కొడుకు దాసరి ధర్మేందర్ (విష్ణు), డ్రైవర్ అమ్జద్‌పాషా రైతు తిరుపతి నుంచి రూ.10 వేలు లంచం తీసుకుంటుండగా పట్టుకున్నారు. నిందితులను కరీంనగర్ ఏసీబీ కోర్టులో హాజరుపరచనున్నట్టు డీఎస్పీ తెలిపారు. గతంలో ఈ భూమి మ్యుటేషన్ సమయంలో కూడా ఇదే తహసీల్దార్ తనను నానా ఇబ్బందులకు గురిచేశాడని ఆవేదన వ్యక్తంచేశాడు. పాస్‌బుక్కు కోసం రూ.50 వేలు లంచం డిమాండ్ చేసి.. ఒకసారి రూ.15 వేలు, రూ.20 వేలు, రూ.15 వేలు తీసుకుని పనిచేయలేదని వాపోయాడు. చివరికి ప్రజావాణిలో దరఖాస్తు చేసుకుంటే.. మ్యుటేషన్ అయ్యి పాస్‌బుక్కు వచ్చిందని తిరుపతి వివరించాడు.

లంచం తీసుకుంటూ పట్టుబడ్డ పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ మండల తహసీల్దార్ జాహెద్‌పాషా, డ్రైవర్, ప్రైవేటు వ్యక్తి

9న ఎన్‌డబ్ల్యూడీఏ సమావేశం

గోదావరి, కావేరి అనుసంధానంలో తెలంగాణ అభ్యంతరాలపై చర్చ

హైదరాబాద్, ఆగస్టు 3 (నమస్తే తెలంగాణ): గోదావరి-కావేరి నదుల అనుసంధానంపై తెలంగాణ ప్రభుత్వ అభ్యంతరాలపై చర్చించేందుకు నేషనల్ వాటర్ డెవలప్‌మెంట్ అథారిటీ ఈ నెల 9న ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నది. ఎర్రమంజిల్‌లోని జలసౌధలో అథారిటీ చైర్మన్ భోపాల్‌సింగ్ నేతృత్వంలో సమావేశం కొనసాగనున్నది. ఈ మేరకు తెలంగాణ అధికారులకు ఎన్‌డబ్ల్యూడీఏ అధికారులు సమాచారమిచ్చారు.జీసీ రివర్ లింక్ ప్రాజెక్టును ప్రధానంగా ఎక్కడినుంచి చేపట్టాలనే అంశంపై సుదీర్ఘకాలంగా చర్చ కొనసాగుతున్నది. తొలుత సమ్మక్కసాగర్, ఆ తర్వాత ఇచ్చంపల్లి నుంచి నీటి మళ్లింపుకోసం ప్రతిపాదనలు చేశారు. ఎన్‌డబ్ల్యూడీఏ బోర్డు సమావేశంలో కొత్తగా ఇంద్రావతి నుంచి కూడా తరలింపుపై ప్రతిపాదించారు. ప్రాజెక్టుపై తెలంగాణ అభ్యంతరాల నేపథ్యంలో 9న సమావేశం నిర్వహించి సందేహాలు నివృత్తి చేయాలని ఎన్‌డబ్ల్యూడీఏ నిర్ణయించింది.

జీఆర్ఎంబీ సమావేశం వాయిదా

సీతారామ ఎత్తిపోతల పథకం డీపీఆర్‌పై చర్చించేందుకు 6న నిర్వహించ తలపెట్టిన గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు సమావేశం మరోసారి వాయిదా పడింది. ఈ మేరకు ఇరు రాష్ట్రాలకు బోర్డు లేఖ రాసింది. సీతారామ ఎత్తిపోతల పథకం- సీతమ్మసాగర్ బహుళార్థసాధక ప్రాజెక్టు డీపీఆర్ జీఆర్ ఎంబీకు ఇప్పటికే చేరింది. కేంద్ర జలశక్తిశాఖ రివర్ బోర్డుల గెజిట్‌లోని ఫ్లో చార్ట్‌ను అనుసరించి ప్రాజెక్టు డీపీఆర్‌పై చర్చించాల్సి ఉంటుంది. అనంతరం బోర్డు అభిప్రాయాలతో డీపీఆర్‌ను జీఆర్ఎంబీ తిరిగి సీడబ్ల్యూసీకి పంపాల్సి ఉంటుంది. ఇందులో భాగంగా డీపీఆర్‌ను బోర్డుకు సీడబ్ల్యూసీ ఇటీవలే పంపింది. దీనిపై చర్చించేందుకు 6న సమావేశం నిర్వహించాలని బోర్డు నిర్ణయించగా సెప్టెంబర్‌కు వాయిదా వేయాలని ఏపీ విజ్ఞప్తి చేసింది.

- **తిరుమల ట్రస్ట్‌కు 'సుమధుర' రూ.కోటి విరాళం**

తిరుమల తిరుపతి శ్రీవేంకటేశ్వర స్వామి అన్నదాన ట్రస్ట్‌కు సుమధుర సంస్థ ఆధ్వర్యంలో రూ.కోటి విరాళాన్ని అందించారు. శ్రీవేంకటేశ్వర స్వామి దర్శనానికి శనివారం విచ్చేసిన సుమధుర సంస్థ చైర్మన్ గుండా మధుసూదన్, వైస్ చైర్మన్ కేవీ రామారావు, డైరెక్టర్లు కందుకూరి భరత్ కుమార్, గుండా నవీన్ కుమార్, మొరంచెట్టి శ్రీనివాసులు ఈ మేరకు తిరుమల జేఈఓ వెంకయ్య చౌదరికి కోటి రూపాయల చెక్‌ను అందజేశారు.

- జూబ్లీహిల్స్

టీ సేఫ్.. 5 నెలల్లో 10,958 డౌన్‌లోడ్స్

ఏడీజీ శిఖాగోయెల్ వెల్లడి

హైదరాబాద్, ఆగస్టు 3 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ఉమెన్ సేఫ్టీ వింగ్ ప్రవేశపెట్టిన టీ సేఫ్ (ట్రావెల్ సేఫ్) యాప్ ద్వారా ఒంటరిగా ప్రయాణించే మహిళలకు మరింత మెరుగైన రక్షణను కల్పిస్తున్నామని ఉమెన్ సేఫ్టీ వింగ్ ఏడీజీ శిఖాగోయెల్ తెలిపారు. గూగుల్‌లో అత్యధిక డౌన్‌లోడ్స్ కలిగిన యాప్‌గా టీ సేఫ్ ఉన్నదని తెలిపారు. గడిచిన ఐదు నెలల్లో 10,958 డౌన్‌లోడ్స్ జరిగాయని వెల్లడించారు. డయల్ 100 ద్వారా కూడా టీసేఫ్ సేవలను పొందుతుండటంతో.. ఐదు నెలల్లో 17,263 మంది మహిళల ట్రిప్‌లను ట్రాక్ చేసినట్లు శిఖా గోయెల్ పేర్కొన్నారు.